క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ ముఖ్యులతో సమావేశం

సీతానగరం: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ ముఖ్యులతో సమీక్షా సమావేశం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మాజీ ఎమ్మెల్యే, అలజంగి జోగారావు ఆధ్వర్యంలో జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, జిల్లాపార్టీ ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ తెలియ జేశారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పార్టీకి సేవలందిస్తున్న నాయకులతో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికతయారు, గ్రామస్థాయి నాయకుల సూచనలు, సలహాల సేకరణ తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యులందరూ హాజరు కావాలని కోరారు.

ముత్యాలమ్మ దేవాలయం ప్రారంభం



ముత్యాలమ్మకు పూజ చేస్తున్న మంత్రి సంధ్యారాణి, కుటుంబసభ్యులు

మక్కువ: మండలంలోని కవిరిపల్లి గ్రామంలో నిర్మించిన ముత్యాలమ్మ దేవాలయాన్ని ఆదివారం మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రారంభించారు. అర్చకులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి హాజరై, కుటుంబ సభ్యులతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి విలేకరులతో మాట్లాడుతూ తమ తండ్రి జన్ని ముత్యాలు జ్ఞాపకార్థం ముత్యాలమ్మ ఆలయాన్ని, తాను జన్మించిన గ్రామమైన కవిరిపల్లిలో నిర్మించామని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మంత్రికి ఎన్నికల కోడ్ పట్టదా?

ఇదిలా ఉండగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎటువంటి ప్రారంభోత్సవాలు చేయకూడదన్న విషయం మంత్రి సంధ్యారాణికి గుర్తు లేకపోవడం విచారకరమని పలువురు విశ్లేషకులు విమర్శిస్తున్నారు. ఓటర్లపై ప్రభావం పడేలా మంత్రి ఆలయ ప్రారంభోత్సవం చేశారని వ్యాఖ్యానిస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారికి మొక్కులు చెల్లించే క్రమంలో ముడ్రాటలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ మాట్లాడుతూ సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని దేవస్థానం ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు సర్వస్వతి పూజతో పాటు అక్షరాభ్యాసానికి అవసరమైన పూజా సామగ్రితో పాటు పలక, బలపం, నూతన పుస్తకం తీసుకురావాలని సూచించారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేపడుతున్నట్లు కార్యనిర్వహణాధికారి వీవీ. సూర్యనారాయణ తెలిపారు.

ఈత చెట్ల తొలగింపు

భామిని: మండలంలోని బత్తిలి కాలనీకి రోడ్డు నిర్మాణం పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఈత చెట్లను తొలగిస్తున్నారు. బత్తిలి ఏబీ రోడ్డు నుంచి జెడ్పీహెచ్ హైస్కూల్ వరకు గల కాలనీకి సీసీ రోడ్డు వేసే కారణంగా ఇరువైపులా ఉన్న ఈత చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా తొలగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఇవే ఈత చెట్ల కింద గీతకార్మికులు ఈత కల్లు దుకాణం పెట్టి అమ్మకాలు చేసేవారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం కోసం ఈత చెట్లను తొలగిస్తున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు.

నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన నిరుద్యోగులకు సివిల్స్ నిమిత్తం శిక్షణ ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు పాడేరు ఐటీడీఏ పరిధిలో సివిల్స్ నిమి త్తం ఆ ప్రాంత నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారని, అక్కడి మాదిరిగానే ఈ ప్రాంతంలో కూడా గిరిజన యువతకు సివిల్స్‌పై శిక్షణ ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికే డిగ్రీ పట్టా పుచ్చుకున్న గిరిజనులు వేలల్లో ఉన్నారని, ఎటువంటి శిక్షణకు నోచుకోకుండా దిష్టిబొమ్మల్లా ఖాళీగా ఉన్న సాలూరు, గుమ్మలక్ష్మీపురం వైటీసీ కేంద్రాల్లో ఈ శిక్షణ తరగతులను ప్రారంభించేందుకు ఐటీడీఏ అధికారులు చొరవ చూపాలని సురేష్ కోరారు.

రైతులకు ఆర్థిక సహాయం అందించాలి

పాలకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించాలని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది రబీ పంటలు పూర్తిగా నష్టపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి సుమారు 9 నెలలు దాటుతున్నా రైతుల కోసం ఇంతవరకు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదని, ఇచ్చిన హామీ మేరకు కనీసం ఆర్థికంగా సహాయం అందించాలని కోరారు.

విద్యార్థులకు వెన్నుపోటు



ఫీజుపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- పథకాలు నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం
- విద్యా, వసతి దీవెనలపై ఊసెత్తని కూటమి
- జిల్లాలో విద్య, వసతి దీవెన లబ్ధిదారులు 36వేల మంది
- విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై వైఎస్సార్‌సీపీ పోరుబాట

పార్వతీపురంటౌన్:

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల వారిని మోసం చేస్తూ వస్తోంది. అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేందటూ మాటమార్చింది. విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ పథకాలు అమలు చేయకుండా విద్యార్థులకు వెన్నుపోటు పొడుస్తోంది. నిరుపేద విద్యార్థులంతా డాక్టర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులుగా తయారు కావాలన్న సమున్నత లక్ష్యంతో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ మరణానంతరం ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని చంద్రబాబు సర్కార్ 2014-19 మధ్యలో పట్టించుకోలేదు. 2019-24 సంవత్సరాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ఫీజురీయింబర్స్ మెంట్ పథకం అమలు చేస్తూ విద్యార్థులకు అండగా నిలిచారు. ప్రస్తుత ప్రభుత్వం మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టి నిర్లక్ష్యం వహిస్తోంది.

నిర్వీర్యం చేసిన ప్రభుత్వం

పేదలు చదువుకోరాదన్న ఉద్దేశంతో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారు. అందుకే వారి చదువులకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎక్కడ పేదలు చదువుకుంటే కార్పొరేట్ స్కూల్స్ విద్యార్థులు గల్లంతవుతారోనని పన్నాగం పన్నుతున్నారు. విద్యారంగాన్ని, పేదల చదువులను కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారన్న బహిరంగ విమర్శలు ఉన్నాయి. విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతూ ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులను చెల్లించకుండా కక్ష సాధింపు చర్యలు చేపట్టి చదువు మధ్యలో మానుకోవాల్సిన దుస్థితికి తీసుకువచ్చిందని పేద విద్యార్థులు వాపోతున్నారు.

తల్లికి వందనానికి మంగళం

విద్యారంగాన్ని నిర్వీర్యం చూసే విధంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుంది. ఎన్నికల ముందు ఇంట్లో ఎంద మంది చదివిన పిల్లలు ఉంటే అంత మందికి తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం జమ చేస్తానని హామి ఇచ్చి మంగళం పాడేశారు. 8వ తరగతి విద్యార్థులకు అందజేయాల్సిన ట్యాబ్‌ల పంపిణీపై ప్రస్తావన లేదు. నాడు-నేడు పనులు నిర్మాణ దశలో ఉన్నివి మధ్యలోనే వదివలేశారు. పాఠశాలల డిజిటలైజేషన్ విధానానికి స్వస్తిపలికి ఐఎఫ్‌పీ ప్యానల్ ఫేజ్-2 పనులు ప్రారంభించలేదు.

ఈ నెల 5న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు

విద్యార్థులకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఈ నెల 5న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఫీజుపోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లించకపోతే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని విద్యార్థులతో నిరసన చేపట్టనున్నారు. పార్వతీపురంలో జిల్లా స్థాయి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నారు.

ఉద్దేశపూర్వకంగా బకాయిలు



పేద విద్యార్థులను చదువులకు దూరం చేయాలన్న ఉద్దేశంతో ఫీజు బకాయిలు పెడుతున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. పేదవిద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మళ్లీ కష్టాలు తీసుకువస్తోంది. వసతి దీవెన, విద్యాదీవెన నిలిపివేసి డిగ్రీ, ఇంజినీరింగ్, డాక్టర్ చదువుల కలలను నీరుగార్చే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోంది. విద్యా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 5న ఫీజు పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే పార్వతీపురం

పేద విద్యార్థులకు అన్యాయం



ప్రస్తుత కూటమి ప్రభుత్వం మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టి పేద విద్యార్థులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఫీజులు కట్టక పోవడంతో కాలేజీల నుంచి విద్యార్థులను వెళ్ల గొడుతునప్పా దిక్కు తోచని స్థితిలో చదువులు మధ్యలో ఆగిపోతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోంది. వసతి దీవెన కూడా ఇవ్వకుండా విద్యార్థులపై కక్ష సాధింపు చేపడతోంది. విద్యార్థులకు అన్యాయం చేస్తే భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు. ఈ నెల 5న పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఫీజుపోరు కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

–శత్రుచర్ల పరీక్షిత్ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

ఉపాధి పనులపై సమగ్ర విచారణ చేపట్టాలి

- జనసేన సాలూరు ఇన్‌చార్జ్ రేగుమహేశ్వరరావు



జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేగు మహేశ్వరరావు

సాలూరు: నియోజకవర్గంలో పల్లె పండగలో భాగంగా ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు బేఖాతరు చేసిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని జనసేన సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేగుమహేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఈ అంశాలపై ఫిర్యాదు చేసినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వంలో సాలూరు మండలంలో సుమారు 300 లక్షల రుపాయల విలువ చేసే 89 ఉపాధి హామీ పనులు, మక్కువ మండలంలో సుమారు 300 లక్షల రుపాయిలు విలువ చేసే 69 ఉపాధి హామీ పనులు, పాచిపెంట మండలంలో సుమారు 296 లక్షల రుపాయల విలువ చేసే 244 పనులు మంజూరు చేశారన్నారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో పది బీటీ రోడ్ల పనులు మంజూరయ్యాయని తెలిపారు. కాగా ఈ పనులకు సంబంధించి జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులు ఉపాధి హామీ చట్టంలోని నియమ నిబంధనలు గానీ, కలెక్టర్ మార్గదర్శకాలు గాని పాటించకుండా చట్టవ్యతిరేకంగా పనులు చేపట్టారని, అది నేరమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మంజూరైన ఉపాధి హామీ పనులను పట్టణానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారని, ఆయనకు సుమారు 80 శాతం సివిల్ పనులు, వెండర్ పేరుతో ఇతరులకు 20 శాతం చిన్న సివిల్ పనులు అప్పగించడం ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. సదరు కాంట్రాక్టర్ క్వారీ నుంచి తీసే మెటీరియల్ నాణ్యమైనది కాదని గతంలోనూ అధికారులు, రైల్వే డిపార్ట్‌మెంట్ వారు ఆ క్వారీ నుంచి తీసిన మెటిరియల్ తీసుకోవడానికి అంగీకరించలేదని పేర్కొన్నారు. కాగా నేడు మళ్లీ ఆ మెటీరియల్‌నే ఆయన పనులకు వినియోగిస్తుండడం వల్ల ఆ రోడ్లు ఎక్కువ కాలం నిలబడవని ఆందోళన వ్యక్తం చేశారు. పైఅంశాలపై సమగ్ర విచారణ నిర్వహించి, క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ అధికారులతో దర్యాప్తు పూర్తయ్యేంత వరకు సదరు కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు నిలుపుదల చేయాలని కోరారు. అంతే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టిన అధికారులందరిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

చిరుద్యోగులు, కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులు, వెలుగు, అంగన్వాడీ, మున్సిపల్ తదితర కార్మికులను తొలగించేందుకు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ప్రయత్నాలు చేయడం, దానికి అధికార యంత్రాంగం తోడ్పడడం సరైన విధానం కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం వారు పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పార్వతీపురం జిల్లా కేంద్రంలోని కొత్తవలస మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కొన్ని సంవత్సరాలుగా మధ్యాహ్నం భోజనం పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొందిన కార్మికులను తొలగించేందుకు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అధికారులను పురికొల్పడం సరైన విధానం కాదని విమర్శించారు. ఉపాధి కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు ఉపాధి తీసివేసేందుకు ప్రయత్నించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వైఖరితో ఇప్పటికే పార్వతీపురం పట్టణంలో వివిధ వర్గాల కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తోపుడు బండ్లు, చిల్లర వర్తకులపై పోలీసులను ఉసిగొల్పి తీవ్ర ఇబ్బందులకు గురిచేసినట్లు తమ దృష్టికి వచ్చిందని నాయకులు తెలిపారు. అదే విధంగా మున్సిపల్ కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, అంగన్వాడీలపై కూడా వేధింపులకు పాల్పడుతున్నారని ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా కార్మికులను చిరుఉద్యోగులను తొలగించే ఈ ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని విమర్శించారు. ఇదే వైఖరిని కొనసాగిస్తే కార్మికులందరినీ ఐక్యం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయగౌరి విజయానికి అందరూ కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కె.విజయగౌరి

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె. విజయగౌరి విజయానికి అందరూ కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విజయగౌరి ఆత్మీయ కలయిక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగం కోసం, ఉపాధ్యాయ అధ్యాపకులు సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసిన కె.విజయగౌరిని గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో కె.విజయగౌరి మాట్లాడుతూ ఒక మహిళను శాసన మండలికి పంపించేందుకు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సీఆర్‌టీలు ఓట్లు వేసి తనను గెలిపించాలని కోరారు. 6 సంవత్సరాలు సర్వీసు విడిచిపెట్టి ఎన్నికల్లో పాల్గొంటున్నానని, ఒక్కసారి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆత్మీయ కలయికలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు, హెచ్ఎం, సీఆర్‌టీ, లెక్చరర్ కాంట్రాక్ట్ జేఎల్ నాయకులు గోవిందరావు, సోమేష్, గణపతి వీరాచారి పాల్గొన్నారు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సీఆర్‌టీలు పాల్గొన్నారు.



మంచులో లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న ప్రయాణికులు



మక్కువ, చెముడు రహదారిలో కురుస్తున్న మంచు

మక్కువను కప్పేసిన మంచు

మక్కువ: మండల కేంద్రం మక్కువను ఆదివారం ఉదయం మంచు కమ్మేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8.45 నిమిషాల వరకు మంచు కురిసింది. ఎడతెరిపి లేకుండా మంచు కురవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. వాకింగ్‌కు వెళ్లిన వారు,ఇతరత్రా పనులుపై బయటకు వచ్చిన వారు మంచుతో ఇబ్బందులు పడ్డారు.



మంచులో సూర్యుని వెలుగులు



సీతానగరం: ఉదయం 9 గంటల సమయంలో కురుస్తున్న మంచు



మంచుతో కమ్ముకున్న జగనన్న కాలనీ

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర ద్రోహం



పార్వతీపురంటౌన్: కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం చేసేదిగా ఉందని సీపీఎం నాయకులు బీవీ రమణ, జి. వెంకటరమణ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం కలెక్టర్ కార్యాలయం ఎదుట కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర విద్యా సంస్థలైన గిరిజన యూనివర్సిటీ, ఐఐటీ ఎన్ఐటీ, ట్రిబుల్ ఐటీ, కడప ఉక్కు పరిశ్రమకు కనీస కేటాయింపులు కూడా ఈ బడ్జెట్‌లో చేయలేదని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు గతంలో కేటాయించిన కేటాయింపుల కంటే తక్కువ కేటాయింపులు చేశారన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ఎంతో ముఖ్యమైన విశాఖపట్నం రైల్వే జోన్‌కు, మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఎలాంటి కేటాయింపులు ఈ బడ్జెట్‌లో చేయలేదని విమర్శించారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులు కూడా ఈ బడ్జెట్‌లో చేయలేదన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి గతంలో ప్రపంచ బ్యాంకు నుంచి ఇచ్చిన అప్పు తప్ప బడ్జెట్లో ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి, మౌలిక వసతులు కల్పనకు, నీటి పారుదల ప్రాజెక్టులకు ఎలాంటి కేటాయింపులు కూడా ఈ బడ్జెట్‌లో చేయకపోవడం విచారకరమని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని అధికార కూటమి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చే విధంగా కేటాయింపులు చేసేందుకు పూనుకోవాలని, లేని పక్షంలో ఈ ప్రభుత్వం కూడా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దావాల రమణారావు, ఎం.ఉమామహేశ్వరి, బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



పాలక రంజిత్ కుమార్

కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, నితీష్ కుమార్ పార్టీల ఎంపీల మద్దతుతో అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో బీహార్ ముఖ్యమంత్రి పోరాడి ఆ రాష్ట్రానికి నిధులు, సంస్థలు సాధించుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, కూటమి నేతలు మాత్రం కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ ఇవ్వకపోయినా ఊరుకున్నారని గిరిజన సంఘం నాయకుడు పాలక రంజిత్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ కోసం జనాభా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, గిరిజన యూనివర్సిటీకి నిధులు, వెనుకకు నెట్టి వేయబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు లేవన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులకు ఆశించిన స్థాయిలో నిధులు లేవని విమర్శించారు. ఇవన్నీ ప్రజలు పోరాడి సాధించు కోవలసిందేనని రంజిత్ కుమార్ అభిప్రాయ పడ్డారు.

ఆంధ్రాకు అవమానం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ శనివారం విడుదల చేసిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం నియోజకవర్గం ఇన్‌చార్జ్ బత్తిన మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర కూటమి నాయకుల చేతగానితనం వల్లే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి మిగిలిందని విమర్శించారు. దేశబడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎలాంటి లాభం లేదని, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు చేయకుండా బడ్జెట్ విడుదల చేయడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, కోలా కిరణ్, సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై గిరిజనుల నిరసన

సాలూరు రూరల్: గిరిజనులు పేదప్రజలపై భారం మోపేవిధంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సాలూరు మండలంలోని జిల్లేడువలస గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీను మాట్లాడుతూ పేద ప్రజలపై భారం వేసి కార్పొరేట్ పెట్టుబడి దారులకు రాయితీలు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి ద్రోహం చేసేవిధంగా ఉందని ఆరోపించారు. ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు జరగకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర విభజన హామీలకు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదన్నారు. విద్య, వైద్యం మౌలిక సదుపాయాలకు నిధులు సరిపడినంత కేటాయించలేదని, సామాన్య ప్రజలపై భారం వేసి పెద్దలకు రాయితీలు ఇచ్చే విధంగా బడ్జెట్ కేటాయించడం పేదలపై ప్రభుత్వం చిన్న చూపు చూడడమే అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సీదరపు అప్పారావు గెమ్మెల జానకి రావు, బాబాయి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



సాలూరు రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు